ప్రజాశక్తి
ఆదివారం 1 డిసెంబర్ 2024
5
శ్రీ సత్యసాయి





గ్రామానికి చెందిన వికలాంగురాలు బోయ భాగ్యమ్మకు పింఛను అందజేస్తున్న ముఖ్యమంత్రి

ఇండస్ట్రియల్ హబ్‌గా 'అనంత'





సభకు హాజరైన జనం

- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- నేమకల్లులో 'పేదల సేవ'లో పాల్గొన్న సిఎం
- రాయదుర్గం నియోజకవర్గానికి వరాల జల్లు

ప్రజాశక్తి - అనంతపురం, బొమ్మనహాల్, రాయదుర్గం

అనంతపురం జిల్లాకు మరిన్ని పరిశ్రమలు తీసుకువచ్చి ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రాయదుర్గం నియోజకవర్గం బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లులో శనివారం ఏర్పాటు చేసిన పేదల సేవలో కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి లబ్ధిదారులకు సామాజిక పింఛనును అందజేశారు. శనివారం ఉదయం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో జింథాల్ విజయనగర ఎయిర్‌పోర్టుకు వచ్చిన చంద్రబాబు నాయుడు అక్కడిన ఉంచి హెలికాప్టర్‌లో నేమకల్లుకు వచ్చారు. ఈసందర్భంగా సిఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. మొదట గ్రామంలోని రెండు నిరుపేద కుటుంబాలకు పింఛను అందజేశారు. గ్రామానికి చెందిన గురువు భాగ్యమ్మకు అంగవైకల్యం పింఛను 6వేల రూపాయలు అందజేశారు. అనంతరం గ్రామంలో పురాతన దేవాలయం అయిన నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన పేదల సేవలో ప్రజావేదికలో చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాష్ట్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. యువత ఉపాధి కోసం ఎక్కడో దూరప్రాంతాలకు వెళ్లకుండా వారి నియోజకవర్గ పరిధిలోనే ఉపాధి కల్పించేందుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒక ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రాభివృద్ధికి నిరంతరం పనిచేస్తున్నామన్నారు. లబ్ధిదారులు 1, 2 నెల పింఛను తీసుకోకపోయినా మూడు నెలలు మొత్తం కలిపి ఒకేసారి చెల్లిస్తామన్నారు. పింఛన్ దారు ఎవరైనా చనిపోతే వారి భార్యకు కూడా వెంటనే పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెవిన్యూలో ఏ సర్టిఫికెట్ కావాలన్నా కేవలం ఒక మెసేజ్ పెడితే మీకు పంపించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. దాదాపు 150 పౌరసేవల్ని ఆన్‌లైన్‌లో పెట్టి టెక్నాలజీ ద్వారా సేవలు అందజేసే ఏర్పాటు కల్పిస్తున్నామన్నారు.

వరాలజల్లు

రాయదుర్గం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరాలజల్లు కురిపించారు. రాయదుర్గ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ పరిధిలోని బైరవానితిప్ప ప్రాజెక్టును హంద్రీనీవా నీటితో నింపుతామన్నారు. ఆనీటితో ఇంటింటికి కొళాయి పథకాన్ని పూర్తి చేస్తామన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామన్నారు. నేమకల్లు, ఉంతకల్లు మధ్యలో 5 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈ ప్రాంతంలో ఐరన్ ఎక్కువగా లభ్యమవుతున్న నేపథ్యంలో మరిన్ని పరిశ్రమలు వచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బొమ్మనహాల్ లో 25,000 ఎకరాల్లో ఇసుక మేటలు, దిబ్బలు ఉన్నాయని, ప్రతి సంవత్సరం అర కిలోమీటర్ పెరుగుతోందని, ఇసుక మేటలు, దిబ్బలు పెరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాంతాన్ని ఎడారిగా మారకుండా పూర్తిగా నియంత్రణ చేసే చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నామన్నారు.

ఆదర్శ పంచాయతీగా నేమకల్లు

నేమకల్లు పంచాయతీని ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. గ్రామంలో ఉన్న పురాతన దేవాలయం నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయ గోపురాల అభివృద్ధికి రూ. 3కోట్ల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. నేమకల్లు గ్రామాన్ని పరిశుభ్రంగా గ్రామంగా తీర్చిదిద్దడానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. సీసీ రోడ్లు, డ్రయినేజీల ఏర్పాటుకు రూ. 5కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామానికి బిసి రెసిడెన్షియల్ పాఠశాలను మంజూరు చేస్తున్నామన్నారు. గ్రామంలోని అర్హులందరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. గ్రామంలో 759 కుటుంబాలకు సోలార్ ప్యానల్స్ పెట్టుకునే అవకాశం ఉందని, మీకందరికీ ఉచితంగా సోలార్ గ్రిడ్ పెట్టించే కార్యక్రమం చేస్తామన్నారు. ఈ గ్రామంలో 1,49,720 చదరపు అడుగుల మేర ఇళ్లపై స్థలం ఉందని, 1,379 కిలోవాట్స్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని, ఇక్కడి ప్రభుత్వ భవనాలపై మరొక 32 కిలోవాట్స్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందన్నారు. రెస్కో కింద సంస్థను ఏర్పాటు చేసి రుణాలు అందిస్తామన్నారు. శ్రీధర్‌గట్ట నీటి ట్యాంకుకు హెచ్.ఎల్.సి మీరు అందించేలా ఏర్పాటు చేస్తామన్నారు. అనంతపురం జిల్లాలో 10 ఎకరాలు మెట్ట పొలం ఉన్న రైతులకు కడుపు నిండడం లేదని అలాంటి వారందరికీ పింఛన్లు ఇవ్వడానికి, రేషన్ కార్డులు మంజూరు చేయడానికి అన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు.

రాయదుర్గం అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

జిల్లాలో అత్యంత వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గం అభివద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని రాయదుర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విజ్ఞప్తి చేశారు. సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం నేమకల్లు గ్రామంలో పర్యటించిన సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రికి వినతి పత్రం సమర్పించారు. 2014-19 కాలంలో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు రాయదుర్గం నియోజకవర్గం అభివృద్ధికి శ్రీకారం చుట్టినప్పటికీ అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిఇప ప్రభుత్వం వాటిని పూర్తి చేయలేదన్నారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయినందున అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేయడంతో పాటు కొత్తగా మరికొన్ని అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. 19 డిమాండ్లను తన వినతిపత్రంలో పేర్కొన్నారు. బిటిపి ఎత్తిపోతల పథకం పూర్తి చేయడంతో పాటు ఉంతకల్లు వద్ద బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాలని, తుంగభద్ర ఎగువ కాలువ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. హంద్రీనీవా పథకం 36 ఏ క్రింద మాల్యాం, ఆవులదట్ల బ్రాంచ్ కెనాల్ ఏర్పాటు చేయాలన్నారు. డి. హీరేహాల్, బొమ్మనహాల్ మండలాలలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు చేసి మధ్యతరహా ఉక్కు పరిశ్రమను స్థాపించాలని కోరారు. రాయదుర్గం పురపాలక సంఘం అభివృద్ధికి 50 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలన్నారు. వేదవతి నదిలో సబ్ సర్ఫేస్ డ్యాం నిర్మాణానికి, ఎడారీకరణ నివారణకు నిధులు మంజూరు చేయాలన్నారు. గ్రామీణ రహదారుల అభివృద్ధికి, మండల కేంద్రాలు డి హీరేహాల్, బొమ్మనహాల్ గ్రామాల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. కణేకల్‌లో డిగ్రీ కళాశాల, బొమ్మనహాల్‌లో బాలుర ఆశ్రమ పాఠశాల. డి. హిరేహాల్ వద్ద ఊటచెరువు ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయాలన్నారు.

నిరాశకు గురైన టిడిపి కార్యకర్తలు

నేమకల్లులో సిఎం పర్యటన తిలకించడానికి బొమ్మనహాల్ మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరాశకు గురయ్యారు. కనేకల్, బొమ్మనహాల్, డి. హీరేహాల్, రాయదుర్గం, బళ్లారి ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తలను, అభిమానులను చంద్రబాబు సమావేశానికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గ్రామ సమీపంలోని కంకర మిషన్ల వద్ద, డి. హీరేహాల్ వద్ద తాము వచ్చిన వాహనాలను పార్కు చేసుకుని ఆక్కడే ఉండిపోయారు. నేమకల్లు గ్రామానికి చెందిన ఆధార్ కార్డు ఉంటేనే సమావేశానికి ప్రవేశం ఉంటుందని పోలీసులు చెప్పారు. దీంతో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరాశతో వెనుతిరిగి వెళ్లిపోయారు.

జిల్లా ప్రగతిపై సమీక్ష

నేమకల్లు పర్యటన అనంతరం హెలీప్యాడ్ వద్ద సిఎం చంద్రబాబు నాయుడు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, ఎమ్మెల్యేలు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



గ్రామంలోని చిన్నారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు



అధికారులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి

'పురం' మున్సిపల్ కౌన్సిల్ మీట్ గందరగోళం

- ఛాంబర్‌లోనే టిడిపికౌన్సిలర్లతో కమిషనర్ ప్రయివేటు చర్చలు
- చర్చించకుండానే అజెండాను ఆమోదించిన టిడిపి కౌన్సిలర్లు
- సమస్యలపై వైసిపి కౌన్సిలర్ల నిలదీత
- కమిషనర్ తీరుపై మున్సిపల్ చైర్మన్ ఆగ్రహం



చైర్మన్‌కు, కమిషనర్‌కు డీసెంట్ నోటీసు ఇస్తున్న వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు తీరుపై మున్సిపల్ తాత్కాలిక చైర్మన్ బలరామిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నిర్వహించే మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశానికి హాజరుకావడానికి మున్సిపల్ తాత్కాలిక చైర్మన్ తో పాటు 15 మంది వైసీపీ కౌన్సిలర్లు కార్యాలయానికి వచ్చారు. అయితే కౌన్సిల్ హాల్ తలుపులు తెరవకపోవడంతో వారందరూ బయటే నిలబడి పోయారు. అప్పటికే టిడిపికి చెందిన కౌన్సిలర్లతో పాటు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన కౌన్సిలర్లు కమిషనర్ ఛాంబర్‌లో మంతనాలు జరుపుతున్నారు. ఏకంగా సమావేశంలో పాల్గొనకుండానే అజెండాలోని 49 అంశాలను కమిషనర్ చాంబర్ లోనే ఆమోదం తెలిపి వెళ్లిపోవాడానికి వారందరూ సిద్ధమయ్యారు. కమిషనర్ చాంబర్ లోకి మీడియా ప్రతినిధులను సైతం అనుమతించకుండా రహస్యమంతనాలు జరిపారు. ఇదే సమయంలో తాత్కాలిక చైర్మన్ బలరామిరెడ్డి కమిషనర్ చాంబర్ ముందు నిలబడి కమిషనర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 గంటలకు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ సకాలంలో వైసిపి కౌన్సిలర్లు అందరూ హాజరయ్యారనిఅధికారులు దానికి అవసరమైన ఏర్పాట్లను చేయాల్సి ఉన్నప్పటికీ, ఏర్పాట్లు చేయకుండా టిడిపికి చెందిన కౌన్సిలర్లతో మంతనాలు ఎట్లా చేస్తారంటూ మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించాల్సిన అధికారులు అధికార పార్టీకి ఏజెంట్లుగా మారి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం తగదన్నారు. తాత్కాలిక చైర్మన్ బలరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న మునిసిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు బయటకు వచ్చి, ఆయనకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తూ కౌన్సిల్ హాలుకు తీసుకెళ్లారు. కౌన్సిల్ హాలులో సైతం అధ్యక్ష స్థానంలో ఉన్న కుర్చీనితీసివేయించి, మరోదానికి వేయడంపై చైర్మన్ తిరిగికమిషనర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధ్యక్ష స్థానానికి సంబంధించిన కుర్చీని మున్సిపల్ సిబ్బంది తీసుకొచ్చి వేశారు. చైర్మన్ సభ ప్రారంభించక ముందే టిడిపికి చెందిన కౌన్సిలర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా హిందూపురం అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నిధులు తీసుకొచ్చారని అన్నారు. దీంతో తాత్కాలిక చైర్మన్ బలరామిరెడ్డి జోక్యం చేసుకున్నారు. సభ ప్రారంభించక ముందే సభ్యులు మాట్లాడడం సభా మర్యాద కాదని, ఒక సీనియర్ కౌన్సిలర్‌గా సభా మర్యాద తెలియదా అంటూ రమేష్ కుమార్‌ను ప్రశ్నించారు. దీంతో రమేష్ కుమార్ తనకు కేటాయించిన కుర్చీలో కూర్చున్నారు. అనంతరం చైర్మన్ సభను ప్రారంభించారు. వెంటనే టిడిపి కౌన్సిలర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం వారి పరిపాలన కాలంలో పట్టణంలో కనీస అభివృద్ధి సైతం చేపట్టలేదని విమర్శించారు. రూ. 750 కోట్లలో రూ.92 కోట్లతో రోడ్ల అభివృద్ధి, రూ. 120 కోట్లతో నీటి సమస్య పరిష్కారం, రూ. 450 కోట్లతో పట్టణంలో భూగర్భ మురుగు కాలువ నిర్మాణం, మరో రూ. 90 కోట్లతో ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ అజెండాను తాము ఆమోదిస్తున్నామని కూటమి కౌన్సిలర్లు చేతులెత్తి అజెండాను ఆమోదించి సభ నుంచి వెళ్లిపోయారు. దీంతో వైసిపి, టిడిపి కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకున్నారు. రూ. 750 కోట్లతో వివిధ అభివృద్ధి పనుల కోసం 49 అంశాలతో కూడిన అజెండాలోని ఒక్క అంశం పైన సైతం చర్చించకుండానే పట్టుమని పది నిమిషాలు సైతం సభలో లేకుండా అజెండాను ఆమోదించి వెళ్లడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. టిడిపి కౌన్సిలర్లకు అభివృద్ధి పనులు చేపట్టిన గుత్తే దారులతో వాటాలు తీసుకోవడానికి చూపించే శ్రద్ధ ప్రజా సమస్యలపై చర్చించారని వైసిపి కౌన్సిలర్లు ఆరోపించారు. బయటకు వచ్చిన కూటమి కౌన్సిలర్ రమేష్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధిని ఓర్వలేక వైసిపి కౌన్సిలర్లు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. వచ్చే ఐదు సంవత్సరాల కాలంలో పురపాలక సంఘాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. సభ నుంచి టిడిపి కౌన్సిలర్లు, వారికి మద్దతు పలికిన కౌన్సిలర్లు వెళ్లిపోయినప్పటికీ వైసిపి కౌన్సిలర్లు అజెండాలోని ప్రతి విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసి, ప్రారంభించిన పనులను రద్దు చేయడం సరైన పద్ధతి కాదన్నారు.చైర్మన్ ఎంపిక జరిగి 20 రోజులు కావస్తున్నప్పటికీ చాంబర్ ఎందుకు కేటాయించలేదని కౌన్సిలర్లు మల్లికార్జున, నాగేంద్రబాబులు కమిషనర్ నిలదీశారు. అజెండాపై చర్చ జరుగుతున్న సమయంలోనే అధికారులు మరో నాలుగు అంశాలతో కూడిన అజెండాను సభ్యుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిని ఆమోదించడానికి కౌన్సిల్ లో బలం లేకపోవడంతో ఇది ఆమోదం తెలిపారా...? లేదా అన్నది ఎవరు చెప్పలేదు. అయితే మురుగు కాలువల శుభ్రం చేయడానికి కోసం రూ: 80 లక్షలు కేటాయిస్తూ అజెండాలో చేర్చిన అంశాలపై వైసిపి కౌన్సిలర్లు అందరూ డీసెంట్ ఇచ్చారు. గతంలో సైతం డీసిల్టేషన్ పేరుతో పెద్ద అవినీతి జరిగిందని ఆరోపించారు. టిడిపికి చెందిన కౌన్సిలర్లు లేకుండానే అధికారులు సభను మమ అనిపించడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, మున్సిపల్ ఇంజనీర్లు బాలసుబ్రమణ్యం, మోహన్, వాణి, ఇతర అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-హిందూపురం

ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలని జిల్లా ఉప విద్యాశాఖ అధికారి రంగస్వామి సూచించారు. హిందూపురం రూరల్ మండల పరిధిలోని బిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఎఫ్‌ఎల్‌ఎన్. మూడవ విడత శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. బిట్స్ ఇంజనీరింగ్ కాలేజీలో ఒకటి, రెండు తరగతులు బోధించు సత్యసాయి జిల్లాలోని ఉపాధ్యాయులకు మూడవ విడత శిక్షణ నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఉపవిద్యా శాఖ అధికారి రంగస్వామి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు గణితం, తెలుగు, ఇంగ్లీష్ భాషలలో శ్రద్ధగా బోధించాలని, విద్యార్థుల స్థాయికి దిగి బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు గంగప్ప, ప్రసన్నలక్ష్మి, అంజనేయులు నాయక్, శేషాచలం, ఆర్పీలు శివయ్య శ్రీనివాసులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవి బాధితులకు మద్దతుగా సంఘీభావ ర్యాలీ

ప్రజాశక్తి-హిందూపురం

హెచ్‌ఐవి బాధితులకు మద్దతుగా, ఎయిడ్స్‌తో మృతి చెందిన వారి ఆత్మ శాంతి కోసం శనివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఐసీటీసీ విభాగం, చైతన్య సంస్థ సంయుక్తంగా ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రి నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎయిడ్స్ బారిన పడిన బాధితులు ఆత్మస్థైర్యంతో జీవనం సాగించాలన్నారు. ఈ ర్యాలీలో చైతన్య స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ తిప్పేస్వామి,ఐసీటీసీ కౌన్సిలర్లు విమలా కుమారి,బాబు, డి.ఎస్.ఆర్.సి. కౌన్సిలర్లు మారుతీ ప్రసాద్, లింక్ ఆర్ట్ సెంటర్ స్టాఫ్ నర్స్ పూర్ణిమ, ల్యాబ్ అసిస్టెంట్ సరిత, సిబ్బంది నవీన్ కుమార్,సుజనా, శిల్పకళ,లక్ష్మి, నాగరాజు చైతన్య సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

యన్.యస్.పి.ఆర్. విద్యార్థుల క్యాండిల్స్ ర్యాలీ

హెచ్‌ఐవి బాధితులకు సంఘీభావం తెలుపుతూ మృతులకు శాంతి చేకూరాలని స్థానిక యన్.యస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్, చైతన్య స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ జీ.వెంకటేశులు అధ్యాపకులు డాక్టర్.యశోదా దేవి, డాక్టర్.శ్రీధర్, డాక్టర్.సరస్వతి, ఎన్ఎస్ఎస్ పోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, రెడ్ రిబ్బన్ క్లబ్ ఇన్‌ఛార్జి అమరేష్, చైతన్య స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఓటరు జాబితా సవరణ పక్కాగా జరగాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఓటరు జాబితా సవరణ పక్కాగా జరగాలని, నిబంధనల ప్రకారం క్లైములు పరిష్కరించాలని ఎలక్షన్ రోల్ పరిశీలకులు కె.కన్నబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితా సవరణపై శనివారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో కలెక్టర్ టిఎస్.చేతన్ పాల్గొన్నారు. కన్నబాబు మాట్లాడుతూ ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకుల సహకారం తీసుకుని ప్రతి క్లైమ్, అభ్యంతరాలను పరిశీలించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను నిష్పక్షపాతంగా పారదర్శకంగా నిబంధనల ప్రకారం పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో 14,08, 769 మంది ఓటర్లు, 1,576 పోలింగ్ కేంద్రాలు, 1,576 మంది బిఎల్ఒలు ఉన్నారన్నారు. జనవరి 1వ తేదీ నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ విజయ సారథి, నియోజకవర్గ ఎన్నికల అధికారులు, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆనంద్‌కుమార్, సువర్ణ, మహేష్, వి.విజయశర్మ, టిడిపి-సామకోటి ఆదినారాయణ, సిపిఎం-పైపల్లి గంగాధర్, మున్సిపాలిటీ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కన్నబాబు, కలెక్టర్ చేతన, తదితరులు

ఎమ్మెల్యే దృష్టికి 104 ఉద్యోగుల సమస్యలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

104 ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆ యూనియన్ జిల్లా నాయకులు ఎమ్మెల్యే ఎంఎస్.రాజుకు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించాలన్నారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని, 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డిఇఒలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, స్లాబ్ సిస్టం అమలు చేయాలని, ఇన్సూరెన్స్ చేయించాలని, యాజమాన్యం నుంచి రావాల్సిన ఇతర బకాయిలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో 104 ఎంప్లాయిస్ యూనియన్ కమిటీ సభ్యులు షబ్బీర్, నాగరాజు, చంద్రహాస్, నవీన్, సాయిరాకేష్‌రెడ్డి, మంజునాథ్, చౌడప్ప, మంజునాథ్, రామయ్య, మొహమ్మద్, దేవరాజు, మారుతి, విజయ్ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కన్నబాబు, కలెక్టర్ చేతన, తదితరులు

పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఆదర్శం : ఎమ్మెల్యే

మడకశిర : పింఛన్ల పంపిణీలో ఎపి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. మండలంలోని ఆర్.అనంతపురం, మడకశిర పట్టణంలోని వాల్మీకి సర్కిల్, అమిదాలగొంది, గౌరీపురం గ్రామాల్లో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్, నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం పెనుకొండ సిహెచ్‌సి, ఐసిటిసి సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో డాక్టర్ వర్షిత్‌తేజ్, ఐసిటిసి కౌన్సిలర్ శివజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ నూర్‌మహ్మద్, జన జాగృతి ప్రతినిధులు శశికళ, విహాన్, సిబ్బంది శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఎల్‌టి విద్యార్థులకు హెచ్ఐవి, ఎయిడ్స్, నాకో, ఎపి సాక్స్, ఐసిటిసిలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.సుదర్శన్, అధ్యాపకులు చాంద్‌బాషా, నందకుమార్, పాల్గొన్నారు.

గోరంట్ల : స్థానిక శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల, ఎస్‌పివిఎం డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపల్స్ భక్తవత్సలం, విజయలక్ష్మి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ పిఒలు ఆజాద్, రఘునాథరెడ్డి, బాలమోహన్ పర్యవేక్షణలో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ భక్తవత్సలం హెచ్ఐవి, ఎయిడ్స్ సంక్రమణ, లక్షణాలు, జాగ్రత్తలు, మందులు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మి, సుహాసిని, రిజ్వానా, అర్షియా, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

శిశుగృహంలో చిన్నారి అప్పగింత

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలోని చాలకూరు గ్రామ శివాలయం వద్ద ఎవరో 3 నెలల మగ శిశువును వదిలి వెళ్లారు. శనివారం తెల్లవారుజామున స్నానానికి వెళ్లిన అయ్యప్పస్వామి మాలధారులకు చిన్నారి ఏడుపు వినపడి అటుగా వెళ్లారు. అక్కడ కేవలం బాలుడు మాత్రమే ఉండడంతో ఆ బాలుడిని తీసుకొని సమీపంలోని అంగన్వాడీ టీచర్ శ్రీదేవికి అప్పగించారు. సిడిపిఒ అనురాధ, ఎసిడిపిఒ గీతాబాయి, సూపర్వైజర్ సుధారాణి సూచనల మేరకు ఆమె బాలుడిని హిందూపురం ఆసుపత్రికి తీసుకెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించారు. అనంతరం శిశువును సిడిపిఒ అనురాధ, సూపర్వైజర్ సుభారాణి ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని శిశు గృహంలో అప్పగించారు.


శిశువును పుట్టపర్తిలో శిశుగృహంలో అప్పజెబుతున్న సిడిపిఒ అనురాధ, సూపర్వైజర్ సుభారాణి

అయ్యప్ప ఆలయంలో అన్నప్రసాదం

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం జాస్తి గోపిచంద్ర, జాస్తి చంద్రకళ, జాస్తి మేఘన, జాస్తి అమూల్య కుటుంబ సభ్యులు అన్నదానం ఏర్పాటు చేశారు. ముందుగా గురుస్వామి శెట్టప్పస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు జక్కంపూడి పురుషోత్తంచౌదరి మాట్లాడుతూ నేటి నుంచి నెల రోజుల పాటు అయ్యప్ప ఆలయంలో మధ్యాహ్నం అన్నప్రసాదం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో అయ్యప్పసేవా కమిటీ సభ్యులు వడ్డే బొజ్జప్ప, గోగుల కాటమయ్య, అక్కిం ప్రతాప్, బోయపాటి అప్పస్వామి, బొమ్మినేని రాము, తొట్లు వేణు, కుమ్మర శివయ్య, ఫొటో స్టూడియో మహేష్, ఐచర్ శ్రీనివాసులు, మాలధారులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ సీటు విజేతకు అభినందనలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్


పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థిని కె.వర్షారెడ్డి ఎంబిబిఎస్ సీటు సాధించింది. కె.వర్షారెడ్డి 1 నుంచి పదో తరగతి వరకూ కాకతీయ విద్యానికేతన్‌లో చదివిందని, ఆమె ఈ ఈ విద్యా సంవత్సరంలో అనంతపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించింది. దీంతో పాఠశాల కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాశ్‌రెడ్డి, శెట్టిపి పద్మ శనివారం పాఠశాల ఆవరణలో వర్షారెడ్డిని అభినందించి ప్రోత్సాహకంగా నగదు అందజేశారు. విద్యార్థులు కె.వర్షారెడ్డిని ఆదర్శంగా తీసుకొని ఇష్టంతో ప్రణాళికాబద్ధంగా చదివి తాము ఎంచుకున్న రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


కె.వర్షారెడ్డిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

బీడీ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సిఐటియు నాయకులు జగన్మోహన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీడీ కార్మికుల సమస్యలపై బీడీ అండ్ సిగార్ యూనియన్ సిఐటియు పిలుపుమేరకు శనివారం పట్టణంలోని నిజాంవలికాలనీ, కంచుకోటలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ బీడీ కార్మికులకు గుర్తింపు కార్డులు, పక్కా ఇళ్లు, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్మోహన్, ముస్తాక్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు మాబున్నిసా, కృష్ణానాయక్, ఫాజిల్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీడీ కార్మికులు


పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

హామీలు నెరవేరుస్తున్నాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎన్నికల హామీ మేరకు పింఛన్లు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 32వ వార్డులో శనివారం చేపట్టిన పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాలంటీర్ వ్యవస్థ లేకపోతే పింఛన్లు పంపిణీ చేయడం సాధ్యం కాదని గత వైసిపి ప్రభుత్వం ప్రచారం చేసిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థ లేకపోయినా ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ మెగా లోక్‌అదాలత్ : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ఈ నెల 14వ తేదీ పట్టణంలోని కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తామని, అందులో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని జిల్లా ఎస్పీ వి.రత్న ఆదేశించారు. పట్టణం లోని జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో శనివారం జిల్లాలోని కోర్టు కానిస్టేబుళ్లతో సమా వేశం నిర్వహించారు. జాతీయ మెగా లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పించి, ఇరుపక్షాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వీలైనంత వరకూ ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారానికి చొరవ చూపే సిబ్బందికి ప్రోత్సాహకాలు కూడా ఉంటాయని తెలిపారు. సమావేశంలో డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, సిసిఎస్ సిఐ శివాంజనేయులు, ఐటీ కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

94 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో శనివారమే పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,65,277 మంది పింఛనుదారులు ఉండగా ప్రభుత్వం రూ. 114.29 కోట్లు విడుదల చేసింది. శనివారం సాయంత్రానికి 94 శాతం పంపిణీ జరిగిందని డిఆర్‌డిఎ పిడి నరసయ్య తెలిపారు. మిగిలిన వారికి 2వ తేదీ పంపిణీ చేస్తామన్నారు. ఏదేని కారణం చేత పింఛను తీసుకోలేకపోయిన వారికి తర్వాత నెలలో రెండు నెలల మొత్తం పంపిణీ చేస్తామని, 2వ నెల కూడా తీసుకోలేని వారికి 3వ నెలలో మొత్తం కలిపి పంపిణీ చేస్తామన్నారు.

పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ధర్మవరం డివిజన్ డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వి యా సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. వివిధ విభాగాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రికార్డులన్నీ సమగ్రంగా ఉండాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ఆమె వెంట డాక్టర్ రాజేంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సరస్వతమ్మ, మేల్ హెల్త్ సూపర్వైజర్ భాస్కర్‌రెడ్డి, స్టాఫ్ నర్సులు, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, తదితరులు పాల్గొన్నారు.

2న ప్రజాదర్బార్

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో డిసెంబర్ 2వ తేదీ 'ప్రజాదర్బార్' నిర్వహిస్తారని టిడిపి మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, దుర్గేష్, శివకుమార్ తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. అందులో అన్నిశాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్లు పట్టివేత

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ శివరాముడు హెచ్చరించారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలోని ఇసుక రీచ్ నుంచి అనుమతి లేకుండా 4 ట్రాక్టర్లు, 2 టిప్పర్లల్లో ఇసుకను తరలిస్తుండగా సిఐ శివరాముడు పట్టుకొని విజిలెన్స్ అధికారులకు అప్పగించారు.

పేకాటజూదరులు అరెస్టు

ప్రజాశక్తి-తనకల్లు

మండలంలోని బిసనవారిపల్లి గ్రామ శివారులో శనివారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 10,150 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బదిలీ ప్రిన్సిపల్‌కు సన్మానం

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎంజెపి కళాశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరుకు బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ జ్యోతిని శనివారం కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉన్నతాధికారి రామప్ప, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రిన్సిపల్ జ్యోతిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కొత్తచెరువు, కొత్తచెరువు రూరల్

కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. మండలంలోని కేశాపురం, మైలసముద్రం, నారేపల్లి పంచాయతీలు, కొత్తచెరువులో శనివారం పింఛనుదారులకు ఎమ్మెల్యే పింఛను సొమ్ము అందజేశారు. డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేశామన్నారు. సిఎం చంద్రబాబు ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నార న్నారు. పంచాయతీల అభివృద్ధికి శ్రీకారం చుట్టారన్నారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి పాలన మొత్తం అవినీతి మయం అన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు, రంగాలను వైసిపి ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. నియోజకవర్గంలో 195 చెరువులకు నీళ్లు ఇచ్చే కార్యక్రమం అతి త్వరలో అమలు చేస్తామ న్నారు. అనంతరం కొత్తచెరువులో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పల్లె రఘునాథ్‌రెడ్డి పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్లు రామకృష్ణ, శ్రీనివా సులు, మల్లిరెడ్డి, సాలెక్కగారి శ్రీనివాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బుక్కపట్నం : ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. స్థానిక ఎస్సీ కాలనీలో చేపట్టిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. వారితోపాటు తహశీల్దార్ షాబుద్దీన్, టిడిపి మండల కన్వీనర్ కమల్‌రెడ్డి, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ సర్పంచి యశోద, గంగాధర్, మాజీ ఎంపీపీ బాలు, వెంకట రాముడు, సయ్యద్ బాషా, మంజు, సుధీర్, జయరాం, తదితరులు పాల్గొన్నారు.


కొత్తచెరువులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూర రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి

చంద్రబాబుకు ఎమ్మెల్యే స్వాగతం

పుట్టపర్తి రూరల్ : అనంతపురం జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబుకి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పూలబొకే ఇచ్చి స్వాగతం పలికారు. సత్యసాయి మహా సమాధి దర్శనార్థం పుట్టపర్తికి రావాలని ఆహ్వానించినట్లు ఆమె తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి ఉన్నారు.

పావగడ శనీశ్వరుని ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

కొత్తచెరువు : కర్నాటకలోని పావగడలో వెలసిన శనీశ్వరుని ఆలయాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి సందర్శించి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు వారికి ఆలయ అధికారులు ప్రత్యేక ఆహ్వానం పలికారు. దర్శనం అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించారు.

జిల్లావ్యాప్తంగా సివిల్ రైట్స్ డే

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీసులు, అధికారులు పౌర హక్కుల దినోత్సవం(సివిల్ రైట్స్ డే) కార్యక్రమాలు నిర్వహించారు. కాలనీల్లో ప్రజలతో కలిసి అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రజల మధ్య అసమానతలు తొలగినప్పుడే సామాజిక వివక్ష తొలగిపోతుందన్నారు. నిరక్షరాస్యత, పేదరికంతో వెనుకబడిన ప్రజలకు పౌర హక్కుల పరిరక్షణ గురించి అవగాహన కల్పించారు. పౌరులకు ఎలాంటి సమస్య ఉన్నా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు పోలీసులకు సహకరించాలని కోరారు. పౌర హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బత్తలపల్లి : అన్యాయానికి గురైతే పోలీసులను ఆశ్రయించాలే కానీ అనవసరంగా ఎస్సీ, ఎస్టీ చట్టాలను దుర్వినియోగం చేయవద్దని డిప్యూటీ తహశీల్దార్ షణ్ముఖకుమార్‌యాదవ్ సూచించారు. మండలంలోని ఈదులముష్టూరులోని నేతాజీసుభాష్‌చంద్రబోస్ కాలనీలో నిర్వహించిన సివిల్ రైట్స్ డేలో డిటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలందరూ ఒక్కటేనని, గ్రామాల్లో ఎవరైనా వారి హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. సదస్సులో వీఆర్వో ముత్యాలన్న, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, పోలీస్ కానిస్టేబుల్ జనార్దన్, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

లేపాక్షి : మండలంలోని బిసలమానేపల్లి పంచాయతీ పరిధిలోని రాజీవ్ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపిడిఒ నరసింహమూర్తి, ఎస్ఐ నరేంద్ర హాజరై మాట్లాడారు. దేశంలోని పౌరులందరికీ సమాన హక్కులు ఉంటాయని, వాటిని పరిరక్షించడం మా బాధ్యత అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రమీలమ్మ, మాజీ సర్పంచి మాలక్క, అభి, ప్రజలు పాల్గొన్నారు.


పుట్టపర్తిలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహిస్తున్న పోలీసులు, అధికారులు


బుక్కపట్నం : ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి కుల వ్యవస్థను నిర్మూలించాలని డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు తెలిపారు. మండలంలోని సిద్ధరాంపురం గ్రామపంచాయతీలోని ఆర్‌డిటి స్కూల్‌లో ఎస్సీ ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, రెండు గ్లాసుల పద్ధతిని నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ మస్తాన్, రామాంజనేయులు, వీఆర్వో వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండలంలోని ఉప్పలపాడు గ్రామ ఎస్సీ కాలనీలో సిఐ శివరాముడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ శివరాముడు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నారాయణస్వామి, ప్రజాప్రతినిధులు పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయని, పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ చట్టాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

బిసి సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

బిసి సంక్షేమ సంఘం జిల్లా కమిటీలో మండలానికి చెందిన ఇద్దరు నాయకులకు చోటు దక్కింది. ఇటీవల మంగళగిరిలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు శంకర్రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఎంపిక చేశారు. అందులో మండలానికి చెందిన వడ్డే పూజారి తిరుపతయ్యను జిల్లా ఉపాధ్యక్షునిగా, బాపనపల్లి వెంకటరమణను జిల్లా సహాయ కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ధర్మవరం పట్టణ అధ్యక్షులు బండి వెంకటేష్, ఉపాధ్యక్షుడు గోగుల రవి కార్యదర్శి జంగమన్న, సహాయ కార్యదర్శి బెల్లం తిరుపాల్, కోశాధికారి బిటి కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు పూలబొకే ఇస్తున్న వెంకటరమణ

ఎపి ఎస్‌టిఎ జిల్లా ఉపాధ్యక్షులుగా కిష్టప్ప

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కె.క్రిష్టప్పను ఎపి ఎస్‌టిఎ(ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్) జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించినట్లు శనివారం ఆయన తెలిపారు. పెనుకొండలో జరిగిన సమావేశంలో అధ్యక్షులు కాడిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అందులో కె.క్రిష్టప్పను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించారు. క్రిష్టప్ప మాట్లాడుతూ 117 జీవో రద్దు, సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు, తదితర ఉపాధ్యాయ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో కలిసి తన వంతు పోరాటం చేస్తానని తెలిపారు.



పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

పిల్లలకు చిన్నప్పటి నుంచే పౌష్టికాహారం అందించాలని న్యాయ సేవ అధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎస్.జయలక్ష్మి సూచించారు. పట్టణంలోని భవిత వికలాంగుల స్కూల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జడ్జి జయలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించాలని, క్రమం తప్పకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి టీకాలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. శిబిరంలో పిల్లలకు కదిరి ఏరియా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ హారిక, లక్ష్మీరాం, తిరుమలేష్ అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగేంద్రరెడ్డి, ఎంఇఒ ఓబుల్‌రెడ్డి, భవిత సెంటర్ టీచర్స్ సౌజన్య, అన్వేష్, స్కూల్ హెచ్ఎం వెంకటాచలం, వికలాంగుల సంఘం అధ్యక్షులు ఇంతియాజ్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించండి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ఉపాధి హామీలో తక్షణమే ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని సిపిఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించకపోవడంతో పనులు లేక కూలీలు వలస పోయే దుస్థితి ఏర్పడిందన్నారు. ఇకనైనా మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించి ఉపాధి పనులు చేపట్టాలని, లేనిచో డిసెంబర్ రెండో వారంలో ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రైతు సంఘం మండల నాయకులు దాబా కృష్ణ, గంగిరెడ్డిపల్లి నాయుడు, మండల సహాయ కార్యదర్శి తిప్పయ్య, నాయకులు తుమ్మల చెన్నప్ప, రాధాకృష్ణ, ఆదెప్ప, శంకర, ప్రసాద్‌నాయక్, ఈశ్వర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల వ్యాప్తంగా నెలకొన్న ప్రజల సమస్యలను మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ ఆదినారాయణ యాదవ్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో సీసీ రోడ్లు, ఉపాధి, వీధిలైట్లు, వ్యవసాయం, పలు సమస్యలపై చర్చించారు. ముస్లింల శ్మశానవాటిక, ఈద్గా సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో దివాకర్, అగ్రికల్చర్ ఆఫీసర్ నరసింహులు, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు చిన్న బాలముని, పంచాయతీ సెక్రటరీలు సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

జడ్జి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని భవిత కేంద్రం, మున్సిపల్ ప్రైమరీ పాఠశాల ఎల్‌సికె పురంలో శనివారం ధర్మవరం కోర్ట్ సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు, వైద్య శిబిరం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ నేత్రదానం చేయండి మరో ఇద్దరికి చూపు ఇవ్వండి అన్నారు. డాక్టర్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవాగుణంతో పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఉరుకుందప్ప, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎం.వేణుగోపాల్, డాక్టర చంద్రిక, ఎంఇఒ రాజేశ్వరి, లాయర్ బాలసుందరి, డాక్టర్ లలిత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న అధికారులు

పింఛన్ల పంపిణీకి 'డివైజ్' కష్టాలు

ప్రజాశక్తి-అగళి

మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అయితే బ్యాడిగెర గ్రామంలో పంపిణీదారులకు డివైజ్ లేక పింఛన్ల పంపిణీలో చాలా ఇబ్బంది పడ్డారు. ఉదయం 6 నుంచి 7.30 గంటల వరకు డివైజ్ కోసం వేచి చూశారు. చివరకు పక్క గ్రామం నుంచి డివైజ్ తీసుకొచ్చి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా తమకు కొత్తగా డివైజ్ ఇవ్వలేదని, పాతదానికి రీఛార్జి చేయించి వచ్చే నెల సకాలంలో పింఛను పంపిణీ చేస్తామని తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి-తాడిమర్రి

మండల కేంద్రమైన తాడిమర్రిలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 703 పనులకు గానూ రూ. 68,693 రికవరీకి ఆదేశించారు. ప్రజావేదికలో ప్రిసైడింగ్ అధికారి కె.విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, ఎపిడి వెంకటాచలపతి, అంబుడ్స్‌మెన్ శివశంకర్‌రెడ్డి, ఎంపీడీవో రంగారావు, ఏపీవో సంజీవరెడ్డి, ఎస్ఆర్పి తిరుమలేష్, ఉపాధి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడి మృతికి నివాళి

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుడు చిరంజీవి(61) శనివారం మృతిచెందాడు. ఆయన అనారోగ్యంతో మూడు రోజుల క్రితం అనంతపురంలోని ఓ హాస్పిటల్‌లో చేరాడు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎంపీడీవో నటరాజ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్మికులు చిరంజీవి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 15 వేలు అందజేశారు. కార్యక్రమంలో రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, నరసింహులు, క్రిష్టప్ప పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-మడకశిర

ప్రతి ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళిబాబు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అమిదాలగొంది జడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న మరువపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి హత్యకు గురి కావడం బాధాకరం అన్నారు. ప్రతి పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, తల్లిదండ్రుల అనుమతి లేకుండా విద్యార్థులను బయటకు పంపకూడదన్నారు.

IN THE COURT OF THE Ist ADDL.JUNIOR CIVIL JUDGE: ANANTHAPURAMU
O.S. No:1415/2022

Between:
Canara Bank.(Rep by its authorized officer, Manager and Authorised officer, Canara Bank, Gondireddypalli Branch, Rapthadu Mandal, Anantapuramu Dist)
...Plaintiff

And

K.Ramakrishna ...Defendant

Notice to Defendant

To
K.Ramakrishna, Aged 42 years, S/o K.Kadirappa Alies K.Chandrayudu, D.No.22- 483 upstairs, Yadava Street, ward-22, Dharmavaram, Sri Sathya Sai Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 09-01-2025వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
CHILAMAKURI SRENIVASULU, Advocate, Ananthapuram. Cell:9490122008